# మా కొద్దీ బతుకు

పి.వి. నరసింహారావు

జనవరి నెల. ఉదయం ఎనిమిది గంటలైనా ధనుర్మాసపు చలి ఇంకా వణికిస్తూనే ఉంది. వేడివేడిగా టీ త్రాగి పేపరు చూస్తూ ఇంట్లో కూర్చున్నాను.

"దరవు పెబువులు. వూరాజులు. బాబూ! బసవన్నొచ్చినాడు. పంట రోజులు. దానం చెయ్యండి. మీ చేతుల్తోటి బసవడికో పాత గుడ్డముక్కిప్పించండి. అయ్యవారికీ అమ్మవారికీ దణ్ణం పెట్రా." ఆ వెంటనే తూ...తూ... డూ... డూ... అంటూ డోలూ సన్నాయీ.

చిరపరిచితమైన కంఠ స్వరం వీధి వాకిట్లోంచి వినిపించేనరికి లేచి స్వెట్టర్ తొడుక్కుంటూ అవతలికెళ్లాను.

వాకిట్లో గంగిరెద్దు ముందు కాలొకటి ఎత్తి నిలబడి వుంది. ప్రక్కనే సన్నాయి వాయిస్తూ అతనూ, డోలు కొడుతూ ఆమె.



అతను... లింగవ్ప! నన్ను గుర్తుపట్టినా పలకరించటానికి జంకినట్టున్నాడు. చిన్నగా నవ్వి చేతులు జోడించి ఊరుకున్నాడు.

లోపలి నుంచి అమ్మ చేటతో ధాన్యం తెచ్చి అతని జోలెలో పోసి, పాత చీరొకటి ఆమె చేతుల్లో ఉంచింది. అంతమాత్రానికే వాళ్లు ఆనంద పడిపోతూ ఓ పది నిమిషాలసేపు గంగిరెద్దు చేత నానారకాల విన్యాసాలు చేయించి వినోదపరిచారు.

మా అన్నయ్య గారి పిల్లలు చోద్యంగా చూస్తున్నారు. మువ్వలూ మూనలూ గవ్వలూ గంటలతో అలంకరించబడి, రంగు బట్టలు కప్పిన గంగిరెద్దునీ వాళ్లనీ.

ఉద్యోగరీత్యా ఉత్తరాదిన ఉంటోన్న మా అన్నగారి కుటుంబానికివన్నీ వింతే మరి! ఏడాదికోసారి సంక్రాంతికి వచ్చి వెళుతుంటారు. ఇక్కడున్న ఆ నాలుగు రోజులూ పల్లెపట్టు తీరుతెన్నుల్నీ, గంగిరెద్దులాటలూ, బుడబుక్కల పాటలూ లాంటి జానపద కళారూపాల్నీ కెమేరాల్లోనూ భద్రపరచుకుని అపురూపంగా తీసుకుపోతుంటారు.

పోయిన సంవత్సరం ఇలానే గంగిరెద్దుని తీసుకుని లింగప్పా, అతని పెద్ద కొడుకూ వాళ్ల విద్యల్ని ప్రదర్శిస్తోంటే, మా అన్నగారి అబ్బాయి ముచ్చటపడి ఫొటోలు తీశాడు. కలరు ఫొటోలు. చాలా బాగా వచ్చాయి. అందులో ఒకటి ఆ మధ్య ఓ పత్రిక నిర్వహించే ఫొటో ఫీచరుకు పంపిస్తే బహుమతి కూడా వచ్చింది. దాన్ని చూపితే ఈ అనాగరికపు అమాయకులు ఎలా స్పందిస్తారో, ఎంత సంబరపడి పోతారో అనుకుంటూ ఇంట్లోకి వెళ్లాను ఆ పత్రిక కోసం.

లింగప్ప కుటుంబంతో మాకు దాదాపు పదేళ్ల అనుబంధం ఉంది. ప్రతీ ఏడాది పుష్యమాసంలో వచ్చి మా ఇంటికెదురుగా ఉండే ఖాళీ స్థలంలో మర్రిచెట్టు నీడన బస చేస్తుంటారు. ఈత రేకుల బుట్టలు, బట్టల మూట, మట్టి కుండలూ, గంగిరెద్దు, కుక్కలు. అదీ వాళ్ల సంసారపు సరంజామా. రాళ్ల పొయ్యిలో వంట. రాత్రి అంత చలిలో కూడా ఆ చెట్టు కిందే ఆరుబయట పడకా, దాంపత్య జీవితమూను. లింగప్ప ఉబ్బస రోగాన్ని

మంచూ చలిగాలీ తట్టి లేపితే ఆయాసంతో దగ్గుతూ రాత్రంతా జాగారం చేయడం, ఎప్పుడైనా శీతల గాడ్పు భరించలేక వాళ్లు మా వీధి వరండా నాశ్రయిస్తే మా వదినగారు అసహ్యించుకుంటూ విసుక్కోవటం నాకు బాగా గుర్తే. వేకువ పొద్దున లింగప్ప పెద్ద కొడుకు అంత చలిలోనూ సన్నాయి సాధన చేస్తూ, "ఏరువాక సాగారో రన్నో సిన్నన్న" అంటూ అపస్వరాలతో వాయించటం మంచం మీద ముసుగులో మునగదీసుకున్న నాకు అదో గమ్మత్తుగా అనిపించేది. నేను హైస్కూలు నుండి వచ్చేటప్పుడు నావైపు గౌరవంగానూ, ఆరాధనగానూ చూస్తూ, నా చేత నుండే అంతంత పెద్ద పుస్తకాల్లో 'సీతమ్మవారి పెళ్లి పాటలూ, సెవిటి మల్లన్న సోమి సెక్క భజనలూ' ఉంటాయని వాళ్లు చెప్పుకోవటం ఇప్పటికీ గుర్తొచ్చి నవ్వుకుంటుంటాము.

పగలంతా చుట్టుపట్ల గ్రామాల్లోంచి గింజలు తెచ్చుకుని, సంజె పొద్దుకు బస చేరుకునేవాళ్లు. బ్రతుకు భారంగా గడుస్తున్నా జీవన భృతిని కల్పిస్తోంది ఈ కులవృత్తేనని వాళ్లకు బలమైన నమ్మకం. అందులోంచి బయటపడి, వేరే వృత్తి చేపట్టాలన్న ఆలోచనే అపచారంగా అనిపిస్తుందిట వాళ్లకు.

ఓసారి మాటల సందర్భంలో లింగప్పతో అన్నాను కూడా. "మీలాంటి వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక రకాల పథకాలు వేస్తూంది, సదుపాయాలు కల్పిస్తోందీ కదా, వినియోగించుకుని బాగుపడరాదూ? ఓ నరదా సౌఖ్యమూ లేకుండా ఎన్నాళ్లిలా బ్రతుకీడుస్తారూ?" అని.

దానికతను తేలిగ్గా నవ్వేస్తూ, "ఇల్లూ వాకిలీ, ఊరూ వాడా లేకుండా పచ్చుల్లా బతికేవోళ్లం. మాకేటి తెలుస్తాయి బాబూ అయన్నీ. ఏదో ఇలాగే కాలం గడిచిపోనీ మీ దయ వల్ల. మా ముందటోళ్లంతా ఇలాగే బిచ్చమెత్తి బతికీ లేదా. కులవిర్తిని కాలదన్నుకోవడం పాపం కాదా" అనేశాడు.

ప్రక్కనే వున్న మా అన్న అందుకున్నాడు.

"ఆ సంక్షేమ పథకాలూ, అవీ వీళ్లకంత తేలిగ్గా అందుతాయను కున్నావుట్రా? ఇన్‌కం, నేటివిటీ, కుల ధృవీకరణ... ఈ సర్టిఫికెట్లన్నీ సంపాయించటం, ఆఫీసుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ పదేపదే తిరగటం ఆ తతంగం అంతా సంచార జీవులు వీళ్లకేం సాధ్యమౌతుంది?"

"పైగా వీళ్లంతా మన సంస్కృతిలో ఓ భాగం. అనూచానంగా వస్తోన్న ఆచారాల్నీ, నమ్మకాల్నీ వీళ్లు అంత తేలిగ్గా వదులుకోలేరు. వారికందులోనే ఆనందమూ, తృప్తి వున్నాయి మరి."

మా అన్నగారి అభిప్రాయంలో ఏదో సంకుచితత్వం, స్వార్థం తప్ప సరైన రీజనింగ్ లేదనిపించింది. మన ఆనందం కోసం, వినోదం కోసం వీళ్లు ఇలాగే అజ్ఞానపు చీకట్ల దౌర్భాగ్యపు స్థితిలో ఉండాలనుకోవటం ఏ రకమైన సాంఘిక న్యాయమో నాకర్థం కాలేదు. కానీ, నిమ్న జాతుల కోసం అని చెప్పబడుతున్న ప్రత్యేక సౌకర్యాలు, రిజర్వేషన్లు దశాబ్దాల తరబడి సాగుతున్నా, ఈ అసమానతలెందుకు తొలగిపోవటం లేదో మాత్రం మొదటిసారి లీలగా స్ఫురించింది.

మా సంభాషణంతా లింగప్ప పెద్దకొడుకు వింటున్నాడు. అప్పటికి పదేళ్లుంటాయి వాడికి. ఆ వయసుకి వాడికేమర్థం అయిందో తెలీదు కానీ, వాళ్లకూ మరో మంచి బతుకుందని మాత్రం తెలుసుకున్నట్టున్నాడు. నేనింకేదయినా చెప్తానేమోనని నా వైపు ఆశ నిండిన కళ్లతో వాడు చూసిన చూపు నన్నింకా వెంటాడుతూనే ఉంది.

గత సంవత్సరం తరువాత మళ్లీ ఇదే కనిపించటం లింగప్ప కుటుంబం. ఇప్పుడు మా ఇంటెదర ఖాళీ స్థలం సజావుగా లేదు. కట్టబోయే స్కూల్ బిల్డింగ్ కోసం రాళ్లు, ఇసుక, ఇటుకతో నిండిపోయి ఉంది. బహుశా ఇంకెక్కడో మకాం చేసి ఉంటారు.

ఈసారి లింగప్పతోపాటు అతని పెద్ద కొడుకు లేకపోవటం స్పష్టంగా గమనించి, "మీ పెద్ద కుర్రాణ్ణి తీసుకు రాలేదేమిటోయ్? ఇదుగో వాడి కోసం ఈ ఫొటో అలా దాచి ఉంచాను, చూసి సంబరపడిపోతాడని" అంటూ పత్రికలోని ఫొటోని వాళ్ల ముందుంచాను.

అంతే! దాన్ని చూస్తూ కంటతడి పెట్టుకుని విలవిల్లాడిపోయారు లింగప్ప, అతని భార్య.

విషయం తెలీక నేను గాభరా పడ్డాను.

కాసేపటికి తేరుకుని జీరవోయిన గొంతుతో చెప్పారు. కొత్త గిత్తని మచ్చిక చేసుకుంటూ, దాని గిట్టల కిందపడి నడుముని విరగ్గొట్టుకున్నాడుట. పసరు మందులతోనూ, నాటు వైద్యంతోనూ చావుతప్పినా, లేచి నడవలేని స్థితిలో మిగిలిపోయాడుట.

ఎంత విషాదం!

ఏం జీవితాలు వీళ్లవి! తరతరాలుగా ఎన్ని బ్రతుకులిలా మొగ్గ తొడక్కుండానే వోడువారి పోతున్నాయో!

నా కళ్ల చెమరింపుని రెప్పల మధ్యే దాచుకుని, ముఖం దించుకున్నాను.

ఆ రోజంతా నా చేతిలో ఏ పనీ సజావుగా సాగలేదు. మాటిమాటికీ వాడూ, వాడి సన్నాయి పాటా గుర్తొస్తుంటే వాణ్ణి చూడాలన్న కోరిక, ఏదో చేయాలన్న తపన నాలో క్షణక్షణానికీ బలంగా నాటుకోసాగాయి. కానీ ఏం చేయాలో తోచటం లేదు. వాడి ఆపదనెలా తొలగించాలో, కనీసం ఆ బాధనెలా పంచుకోవాలో కూడా తెలీటం లేదు.

రాత్రంతా కొనసాగిన అంతర్మథనంలోంచి చివరికో నిశ్చయానికొచ్చాను. వాడి ఫొటో పొందిన వంద రూపాయల బహుమతి వాడికే చెందాలన్న అంతరాత్మ ప్రబోధంతో.

మర్నాడు ఉదయాన్నే వాళ్లు బసచేసిన పాడుపడిన పాత స్కూలు భవనం దగ్గరకు వెళ్లాను. అప్పటికే లింగప్ప, అతని భార్య చిన్న కొడుకుని తీసుకుని ఊళ్ల మీదికి వెళ్లిపోయారు. పెద్దకొడుకు ఈతరేకుల బుట్ట అల్లుకుంటూ బసలోనే ఉన్నాడు. లేత ఎండలో చిరుగుల దుప్పటిలో సామాన్లను కాపలా కాస్తూ ముసలి గంగిరెద్దులా పడి వున్నాడు.

నన్ను చూసి మొదట విస్తుపోయి, తదుపరి ఎలా సత్కరించాలో తెలీక తికమక పడిపోయాడు.

నేను కుశల ప్రశ్నలతో సంభాషణ ప్రారంభిస్తూ సగం విరిగిన గోడ అంచున కూర్చున్నాను. వాడు పనిచేసుకుంటూనే నా మాటలకు బదులిస్తున్నాడు. వాడి కళ్లలో ఇదివరకటి కాంతీ, ఉత్సాహమూ ఇప్పుడు కనపడలేదు. మాటల్లో నిర్లిప్తతా, నిస్పృహా వ్యక్తమౌతున్నాయి.

తన అవిటితనం తల్లిదండ్రులకు అదనపు భారమౌతోందన్న ఆత్మన్యూనతా భావంతోపాటు, చేతనైనంత చేసి, తన గంజి తాను సంపాయించుకోవాలన్న ఆరాటం కూడా వాడిలో పసిగట్టాను. ఇంత చిన్న వయసుకే వాడి బ్రతుకు పరాధీనం కావడం వాణ్ణి మరింత కృంగదీస్తోంది.

నేను వచ్చిన పని జ్ఞాపకం వచ్చింది. జేబులోంచి వంద రూపాయల నోటు తీసి జాలిగా వాడి కళ్లలోకి చూస్తూ వాడి చేతుల్లో ఉంచబోయాను. వాడు ఆనందంతో ఆత్రంగా అందుకుని, కళ్లకద్దుకుని, కృతజ్ఞతా పూర్వకంగా నావైపు చూస్తాడని ఊహించాను. కానీ అలా జరగకపోవడం నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. అహం కాస్తంత దెబ్బతిన్న మాట కూడా నిజమే. 'ఆ రకమైన' సహాయం నిరాకరించిన వాడి ఆత్మాభిమానం, వ్యక్తిత్వం నన్ను మళ్లీ ఆలోచనల వలయాల్లోకి నెట్టివేశాయి.

ఈ సానుభూతి, తన్మూలకంగా లభించే తాత్కాలిక సహాయమూ... అది ఏ విధమైనప్పటికీ వాడికవసర పడవన్నది రూఢి అయింది. ఇంకేదో కోరుకుంటున్నాడు. ఏమిటిది? అన్నది స్పష్టం కావటం లేదు. అనేక రకాల పథకాలు నా మస్తిష్కంలో సుళ్లు తిరుగుతున్నాయి. ఏ విధంగా చేయూతనివ్వాలి?

రాత్రి బడిలో విద్య, వికలాంగులకిచ్చే పెన్షన్ లేదా పునరావాసం, సరైన ట్రీట్‌మెంట్‌తో మళ్లీ మామూలు మనిషిని చేయటం... ఇలా... ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చి ఆదుకునేవిగా అనిపించలేదు.

నా ఆలోచన్లెంతసేపూ వ్యక్తిపరమైన సమస్య చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి తప్ప, ఆ పరిధిని దాటి విస్తృత పడటం లేదు. మరో కోణంలోకి మళ్లటం లేదు. అందుచేతనే ఏ దారీ కనపళ్లేదు.

నా చూపుల్లో ఆలోచనల తీవ్రతనీ, సంఘర్షణ తీరునీ గ్రహించి నట్టున్నాడు. చివరికి వాడే పరిష్కారాన్ని చూపెట్టాడు. నాయందు విశ్వాసం ప్రస్ఫుటమవుతుండగా అన్నాడు.

"బాబూ! ఆ రోజు మా అయ్యతో తమరన్నారు గదా పెబుత్వం మాలాంటోళ్లకేదో మంచి జేస్తాందనీ, మేమంతా బాగుపడే యీలుందనీ. ఏదో తోవ జూపి తమరే పున్నెం గట్టుకోవాల."

"నా కర్మమిలా కాలిపోయింది. నా బతుకింతే. కనీసం మా తమ్ముడైనా బాగుపడేలాగ చెయ్యండి. అక్కడి నుండీ మా కుటుంబానికి మంచి దారి ఆడే చూపెట్టుకుంటాడు."

"... ... ... ... ..."

"గంగిరెద్దు కుమ్మితే మా తాత చచ్చిపోనాడండి. కొమ్ము తగిలి మా చిన్నాయన కన్ను పోయిందండి. నా సంగతిలాగై పోయినాది."

"ఇకీ కట్టాలు బాదల్తోటి చెట్టు కింద బతుకులు మాకొద్దు. రోగాలు రొష్టు తోటి దిక్కులేని చావులు మాకొద్దు. ఇంకీ బతుకులు బరాయించలేం బాబూ" అంటూ భోరుమన్నాడు తరతరాలుగా పేరుకున్న ఆవేదనని కళ్ల నుండి రాలుస్తూ.

వయసు లేకపోయినా అనుభవం నేర్పిన పాఠంతో వాడు జీవితాన్ని విశ్లేషించుకున్న తీరు, రేపటి తరం కోసం వాడి తపన చూసి సిగ్గుతో కుంచించుకుపోయాను.

వాడి మాటల్లోని ఆవేదన, ఆత్మ నివేదన గుండెల్ని సున్నితమైన చోట్ల విద్యుత్తులా తాకుతుంటే, కర్తవ్యం స్ఫురించి తగిన ఏర్పాట్ల కోసం అక్కణ్ణించి కదిలాను. నా కళ్లలో అప్పటికే లింగప్ప చిన్నకొడుకు అ,ఆ లు దిద్దుకోవటం లీలగా మెదుల్తోంది. ●